క్లుప్తంగా

ప్రజా సమస్యల అర్జీలపై దృష్టి సారించండి



నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలపై అధికారులు దృష్టి సారించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఆర్డీఓ మోవిడి వాణి సూచించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 14 అర్జీలు అందగా వాటిని ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో జాప్యం చేయొద్దని అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్వై నూరానీ, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ సుందరి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



తిరువూరు: ఖరీఫ్ ధాన్యం దిగుబడులను రైతులు దళారులకు విక్రయించవద్దని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి కోరారు. మండలంలోని చింతలపాడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే కొనుగోలు కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన డీఏవో



చాట్రాయి: కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ కోరారు. మండలంలోని చిన్నంపేటలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రైతులు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 40 శాతం వరి కోతలు పూర్తయ్యాయని, 800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. అన్ని ఆర్‌బీకేల్లో 80 వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

పోరుబాట కరపత్రాల పంపిణీ

ఆగిరిపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు పోరుబాట పట్టారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, స్థానిక సమస్యలపై ఈ నెల 14న సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు కోరారు. ఆగిరిపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు శివ నాగరాజు, కే. గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 16న పెన్షన్ అదాలత్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే బోర్డు ఆదేశాల మేరకు గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో డిసెంబర్ 16న నిర్వహించనున్న పెన్షన్ అదాలత్‌ను అన్ని విభాగాల పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని గుంటుపల్లి బ్రాంచి పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ అధ్యక్షుడు ఎస్కే చాంద్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలు ఈనెల 20వ తేదీ లోపు రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు డెప్యూటీ సీపీవోకు అందజేయాలని పేర్కొన్నారు. అందిన సమస్యలకు డిసెంబర్ 16న జరిగే అదాలత్ నాటికి పరిష్కార మార్గం చూపుతామన్నారు. యూఎండీ కార్డు ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. గతంలో మంజూరు చేసిన కార్డుకంటే యూఎండీ కార్డుతో కార్పొరేట్, రిఫరల్ వైద్యశాలల్లో తక్షణ వైద్య సదుపాయం ఉంటుందన్నారు.

ప్రజల పక్షాన పోరాడే పార్టీ సీపీఎం

విస్సన్నపేట: ప్రజల పక్షాన పోరాడే పార్టీ సీపీఎం అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీపీఎం పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం 8వ మండల మహాసభ పార్టీ మేకల జ్ఞానరత్నం, బుర్రి మేరీకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోరాటాలపై అనేక నిర్బంధాలు విధిస్తుందన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు వి.నాగరాజు, ధనలక్ష్మి, రామకృష్ణ, ఏడుకొండలు, రంగారాణి, రామారావు పాల్గొన్నారు.

వైద్యులేరి బాబూ



మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి



ఆసుపత్రిలో ఇన్ పేషెంట్స్ విభాగంలో ఖాళీ బెడ్‌లు

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- విజయవాడ ఆస్పత్రికి రిఫర్ చేయకతప్పని పరిస్థితి

మైలవరం: మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆసుపత్రిగా ఉన్న మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త భవనం నిర్మాణం చేపట్టి 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దారు. అయితే వైద్యులు లేకపోవడంతో ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నీ ఉన్నా..

ఈ ఆసుపత్రికి మైలవరం చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రతి రోజు 250 నుంచి 300 మంది రోగులు వైద్యం కోసం వస్తూ ఉంటారు. ఇన్ పేషెంట్లుగా 20 మంది మాత్రమే ఉన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నా వైద్యుల కొరత వేధిస్తోంది. జనరల్ సర్జన్, నేత్ర వైద్యులు లేకపోవడం రోగులకు ఇబ్బందికరంగా మారింది. దంత వైద్య విభాగంలో తాత్కాలిక ఉపశమనం కోసం మందులు ఇస్తున్నారు తప్ప పంటికి పడిన రంధ్రాలు పూడ్చడానికి అవసరమైన మందులు లేవు. అత్యవసర పరిస్థితుల్లో రోగికి ప్రాథమిక వైద్య చికిత్స చేసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. దీంతో కొన్ని సందర్భాలలో రోగులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

తాగునీటి కొరత..

ఆసుపత్రిలో సరిపడా టాయ్‌లెట్స్ లేకపోవడం, స్వచ్ఛమైన తాగునీరు లభించకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఒక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంక్యుబేటర్‌లు ఉచితంగా అందజేశారు. వీటిని ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడం విశేషం.

ఉన్నతాధికారులకు చెప్పాం..

మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రికి జనరల్ సర్జన్, కంటి వైద్యులు అవసరం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో రోగికి ప్రాథమిక చికిత్స చేసి విజయవాడ రిఫర్ చేయాల్సి వస్తోంది. ఇది ఇబ్బందికరంగా ఉంది. ఈ విషయాన్ని పై అధికారులకు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులకు కూడా తెలియజేశాం. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

– డాక్టర్ వీ జయప్రకాశ్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, మైలవరం

ఐదు రోజులుగా జ్వరంతో..



గత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో ఉంటున్నా. జ్వరానికి మందులు ఇస్తున్నారు. కానీ తగ్గడం లేదు. కానీ నాకు జ్వరం తగ్గకపోవడానికి కారణం తెలియదు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. నాకు త్వరగా నయం చేసి పంపుతారని ఆశిస్తున్నా.

– సింహాద్రి విజయ్, మైలవరం

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో ఆజాద్‌చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలవరం: భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశంలో విద్యావ్యాప్తికి చేసిన సేవలు ప్రశంసనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ తెలిపారు. మైలవరం ఉర్దూ పాఠశాలలో ఆజాద్ జయంతి పురస్కరించుకుని జాతీయ విద్య, మైనారిటీ దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు షకీల, అమీరున్నీసాలను శాలువలతో సత్కరించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, మస్తాన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం: భారత దేశంలో విద్యా విధానంలో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ నూతన ఒరవడి సృష్టించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆజాద్ జయంతి పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాద్ రూపొందించిన విద్యా విధానం దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్, డీన్ అకాడమిక్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి అధికారి ఎల్.నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూలులో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రథమ కేంద్ర విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో విద్యాభివృద్ధికి ఆజాద్ చేసిన కృషిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ వివరించారు. ఉపాధ్యాయులు సుజాత, పద్మలత, లక్ష్మీ శ్యామల పాల్గొన్నారు.



మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో..



మైలవరం ఉర్దూ స్కూల్‌లో ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న గోపాల్, వెంకటేష్ తదితరులు

చాట్రాయి: భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంత్యుత్సవాన్ని మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకట్రావు మాట్లాడుతూ అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. అనంతరం మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా కృష్ణా జిల్లా జట్లు



విజేతలుగా నిలిచిన ఉమ్మడి కృష్ణా జిల్లా బాలుర, బాలికల జట్లు

నూజివీడు: శ్రీకాకుళంలో రెండురోజుల క్రితం నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్- 19 బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా బాలుర జట్టు, బాలికల జట్టు విజేతలుగా నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జిల్లా బాలికల జట్టు పశ్చిమగోదావరి జట్టుపై 30-27 స్కోర్ తేడాతో విజేతగా నిలిచింది. బాలుర ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జిల్లా బాలుర జట్టు విశాఖపట్టణం జట్టుపై 54- 41 స్కోర్ తేడాతో విజయం సాధించింది. కృష్ణా జిల్లాకు చెందిన రెండు జట్లు విజేతగా నిలవడంతో క్రీడాకారులను కోచ్ వాకా నాగరాజు అభినందించారు.


గోనె సంచులు సిద్ధం



చింతలవల్లి ఆర్ఎస్‌కేలో ధాన్యం సంచుల పంపిణీని పరిశీలిస్తున్న ఏవో, తదిరులు

ముసునూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు సిద్ధంగా ఉంచామని ఎంఏవో సందిపాము మధుమోహన్ తెలిపారు. మండలంలోని చింతలవల్లి గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గోనె సంచుల పంపిణీని సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు 5,410 ఎకరాల్లో వరి సాగు చేశారని, 1,50,000 క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ప్రైవేటు వ్యాపారులను, దళారులను నమ్మి అన్నదాతలు మోసపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించదలచిన వారు ఆర్ఎస్‌కే సహాయకుని సంప్రదించి, నమూనాల సేకరించుకోవాలన్నారు. తేమశాతం 17, అంత కన్నా తక్కువ వచ్చిన రైతులకు గోనె సంచులను ఇస్తామన్నారు. రైతు కోరుకున్న రైస్‌మిల్లుకు ధాన్యాన్ని ఉచితంగా తరలిస్తామన్నారు. సొసైటీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



రాజశేఖర్

తిరువూరు: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి పాపగంటి రాజశేఖర్ కనిపించట్లేదని పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వత్సవాయి మండలం మేచినేనిపాలెంకు చెందిన రాజశేఖర్ సోమవారం ఉదయం స్కూలు ప్రహరీ దూకి వెళ్లిపోయాడని, ఆచూకీకై యత్నించగా లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తిరువూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ 94407 96452 నంబరుకు తెలియజేయాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు లేఖ అందజేస్తున్న రైతు సంఘం, సీపీఐ నేతలు

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ పెట్టుబడి రూ.20 వేలు రైతులకు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందారావు కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. రైతుల సమస్యలు సీఎంకు చేరవేయాలని కోరారు. ఈ సందర్భంగా యలమందారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమలో కరువు పరిస్థితి, కోస్తా ప్రాంతాల్లో వరదలు, భారీ వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. ఖరీఫ్‌లో సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు రాష్ట్ర వ్యాప్తంగా తుడిచిపెట్టుకు పోయాయని తెలిపారు. రబీ సీజన్‌కు అయినా పెట్టుబడి సాయం రైతులకు అందించాలన్నారు. రాష్ట్రంలో 40 వేలకు పైగా ఉన్న చెరువులు అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలు, ఎందరో ప్రజాప్రతినిధుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా కాపాడాలని పేర్కొన్నారు. రబీ సీజనల్‌లో పంటల భీమా సొమ్ము ప్రభుత్వమే భరించాలని సూచించారు. రైతు సంఘం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: మండలంలోని కొత్తరావిచర్ల, పాతరావిచర్లలో సీసీ రోడ్ల పనులకు సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో రూ.20 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించే పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాపా శ్రీనివాసరావు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బలివేలోని శ్రీరామలింగేశ్వరస్వామి

నూజివీడు: కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలకు తెల్లవారు జాము నుంచే భక్తుల వచ్చి పూజలు చేశారు. పట్టణంలోని కోట శివాలయం, బస్టాండు వద్ద దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మహాశివునికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముసునూరు: కార్తిక మాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున బలివేలోని చారిత్రక ప్రసిద్ధ బలే రామలింగేశ్వరస్వామి ఆలయంలో త్రిలోచనునికి భక్తులు పెద్ద సంఖ్యలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ముసునూరు, పెదవేగి, ఏలూరు మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. చెక్కపల్లిలోని శివాలయం, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో భారీ సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. రమణక్కపేటలోని పార్వతీ సమేత శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. వేల్పుచర్ల, గుడిపాడు, చింతలవల్లి, గోగులంపాడులోని శివాలయాల్లో పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ మార్గంలో బస్సు సర్వీసులతో మేలు



లోపూడి-యర్రావారి గూడెం రహదారి

ముసునూరు: దగ్గరదారి వదిలేసి నూజివీడు నుంచి చింతలపూడికి విసన్నపేట మీదుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రస్తుతం 62 కి.మీ దూరం ప్రయాణించడం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దగ్గరి మార్గంలో నూజివీడు చేరుకునేలా బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నారు. దీనిపై ముసునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ చర్చించి బస్సు సర్వీసు అవసరమని తీర్మానించారు.

ఇలా చేస్తే సరి..

దీనికి ప్రత్యామ్నాయంగా దూరాన్ని తగ్గిస్తూ చింతలపూడి నుంచి నూజివీడుకు ఫాతిమాపురం మీదుగా దగ్గరి మార్గం ఉంది. వెలగలపల్లి, ఎర్రంపల్లి, యడవల్లి, యర్రావారిగూడెం, లోపూడి, చెక్కపల్లి, చింతలవల్లి, పోతురెడ్డిపల్లి మీదుగా కేవలం 39 కి.మీ దూరం, గంట సమయం పట్టే దారిలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. నూజివీడు నుంచి లోపూడి వరకు నడుపుతున్న సర్వీసును చింతలపూడి వరకు 18 కి.మీ పొడిగిస్తే చాలు.

ప్రయోజనాలు ఇవీ..

ప్రస్తుతం నూజివీడు ఆర్టీసీ డిపో నడుపుతున్న బస్సు సర్వీసుల ప్రకారం నూజివీడు నుంచి చింతలపూడికి 62 కిలోమీటర్ల దూరం, రెండు గంటలకు పైగా ప్రయాణ సమయం. దగ్గర దారిలో బస్సు నడిపితే 39 కీమీ దూరం. ప్రయాణం ఒక గంట సమయం. దీని వల్ల ప్రయాణికులకు టికెట్ చార్జీలు తగ్గి, సమయం కూడా కలిసి వస్తుంది. ఈ రూట్‌లో ఆటో రవాణా లేకపోవడం ఆర్టీసీకి లాభం.

రూట్ సర్వే చేస్తాం..

ప్రస్తుతం లోపూడి వరకు సర్వీసు నడుపుతున్నాం. డిపోకు లాభాలు వస్తాయని ప్రజలు, ప్రయాణికులు సూచిస్తే తప్పనిసరిగా బస్సు సర్వీసులు నడుపుతాం. అతి త్వరలో రూట్ సర్వే చేసి చర్యలు చేపడతాం.

– పవన్‌కుమార్, డీఎం, నూజివీడు ఆర్టీసీ

ప్రయాణం సులభతరం



నూజివీడు– చింతలపూడి బస్సు సర్వీసులు నడిపితే ఐదు నియోజకవర్గాల ప్రజలకు ప్రయాణం సులభమవుతుంది. ప్రయాణికుల ఆదరణ పెరుగుతుంది. చింతలపూడికి నూజివీడు నుంచి విజయవాడకు తక్కువ సమయంలోనే వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు ప్రయాణించవచ్చు.

– పేరం కృష్ణ, సర్పంచ్, లోపూడి

ప్రజల చిరకాల వాంఛ..



వంతెన, రహదారుల నిర్మాణం పూర్తయ్యి ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ఆర్టీసీ బస్సులు నడిపితే చింతలపూడి, లింగపాలెం, చాట్రాయి, ముసునూరు, నూజివీడు మండలాల ప్రజలకు సౌకర్యం. ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. నూజివీడు ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం వస్తుంది.

– పిల్లి సత్యనారాయణ, సర్పంచ్, చింతలవల్లి

రైతులకిచ్చిన హామీ అమలు చేయాలి

- వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందించాలి
- ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహ



తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సహాయం రూ.20వేలు అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేసారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతుల సమస్యలపై సోమవారం నూజివీడులో తహసీల్దార్ బి.సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసిందని, రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న దశలో ప్రభుత్వం ప్రకటించిన రైతుకు రూ.20 వేల పెట్టబడి సాయాన్ని విడుదల చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా సొమ్మును చెల్లించాలన్నారు. మడుపల్లి నాగేంద్రరావు, చలసాని నరేంద్ర, బొప్పుడి రాంబాబు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని కోటపాడులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5 వేల నగదు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.